

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీఎన్ ఆదిత్య, శ్రీజ తదితరులు

పెద్దల సూక్తులు ఆచరణీయాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రుషులు, మహాపురుషులు వారి జీవిత అనుభవాలు, సూక్తులు ఉపదేశాలుగా మనకు అందించారని, అవి ఆచరణీయాలని ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య అన్నారు. త్యాగరాయగాన సభలో ఆదివారం ప్రముఖ నటి, రచయిత్రి శ్రీజ సాధినేని రచించిన శ్రీజ కోట్స్ (నిప్పులాంటి నిజాలు) సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. వీఎన్ ఆదిత్య సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీజ తన జీవితంలో ఎదురైన సంఘటనల నుంచి నేర్చుకున్న అనుభవాలు సూక్తులుగా వెలుగులోకి తెచ్చారన్నారు. ఈ కోట్స్‌లో వాస్తవాలు ఎన్నో ఉన్నాయన్నారు. శ్రీజ నటించిన నేషనల్ హైవే నాటికలో ఆమె నటనను పలువురు ప్రముఖులు కొనియాడారని, మహానటి సావిత్రిని మరిపించగల నటి అని వివరించారు. సినీ దర్శకుడు గౌరీనాయుడు మాట్లాడుతూ.. 'శ్రీజ కోట్స్' ప్రతివారూ చదవతగ్గ సంపుటి అన్నారు.

క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆలిండియా మజ్లిస్ తమేరే మిలత్ మదీనా మెన్షన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ అన్నారు. ఆదివారం ఆలిండియా మజ్లిస్ తమేరే మిలత్ మదీనా మెన్షన్ ఆధ్వర్యంలో సయ్యద్ ఖలీలుల్లా హుస్సేనీ మెమోరియల్ స్కాలర్‌షిప్ 8, 9వ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ..40 సంవత్సరాలుగా తమ సంస్థ ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తూ ఉన్నత విద్య అభ్యసించేలా కృషిచేస్తున్నామని అన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఉమర్ హమేద్ సాదిక్, కోశాధికారి మహ్మద్ మినాజ్ జమాన్, కన్వీనర్ ప్రొఫెసర్ జైనుద్దీన్ నవిద్ పాల్గొన్నారు.

వాలెంటైన్స్ డేను నిషేధించాలి

● ప్రేమ జంటలు కనిపిస్తే బలవంతంగా పెళ్లి చేస్తాం : బజరంగ్ సేన

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వాలెంటైన్స్ డేను నిషేధించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. ప్రేమ జంటలు ఈనెల 14న కనిపిస్తే బలవంతంగా పెళ్లి జరిపిస్తామని, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం కాచిగూడలో బజరంగ్‌సేన రాష్ట్ర కార్యాలయంలో వాలెంటైన్స్ డేను నిషేధించాలని సదస్సు నిర్వహించారు. ఇందిరాపార్కు, సంజీవయ్యపార్కు, పబ్లిక్ గార్డెన్, నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్, నారాయణగూడ మెల్కోటే పార్కు, సినిమా హాల్స్ వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. బజరంగ్‌సేన మహిళా అధ్యక్షురాలు రజనీశ్రీరామోజు, నగర అధ్యక్షుడు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకూ పోరాటం ఆగదు



మాట్లాడుతున్న సామ్యేల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మాదిగలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ప్రతి డివిజన్‌లో కమిటీలు వేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జాతీయ నాయకుడు, సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ మాదిగ అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్యనాయకుల సమావేశం ఎంఎస్పీ డివిజన్ అధ్యక్షుడు దశరథ్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సామ్యేలు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగేవరకూ తమ పోరాటం ఆగదన్నారు. ఎంఎస్పీ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్, నాయకులు ఎల్లయ్య జీవన్, రాహుల్, లతాదేవి, అక్షయ పాల్గొన్నారు.

'ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి'

అంబర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని తెలంగాణ ఏకనామికల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఈబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చాలా వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు.



సన్మానం అందుకున్న కరసేవకులు

అయోధ్య రామమందిరం కరసేవకులకు సన్మానం

కవాడిగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం కరసేవలో పాల్గొన్న కరసేవకులను పరమేశ్వర రామాలయం చైర్మన్ పోటేల్ కృష్ణ యాదవ్, విశ్వహిందూ పరిషత్ కవాడిగూడ ప్రఖండ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా విశ్వహిందూ పరిషత్ అఖిలభారత సహ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు. ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేందుకు కరసేవకు చేసిన సేవలు చిరస్మరణీయమైనవని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథులుగా ధర్మ జాగరణ సమన్వయ సమితి ప్రాంత సహ సంయోజకులు శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది గోసేవా సమితి విభాగ్ ప్రముఖ్ వనజకుమార్, ప్రముఖ వ్యాపారవేత్త పోటేల్ రాహుల్(సాయి) విశ్వహిందూ పరిషత్ కవాడిగూడ, సికింద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముత్యాలరావు, కవాడిగూడ ఆర్యసమాజ్ నిర్వాహకుడు గడీల ఆంజనేయులు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషిచేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఘావ్ చలో కార్యక్రమానికి గాంధీనగర్ డివిజన్‌లో ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్, ఘావ్ చలో బూత్ ఇన్‌చార్జి ఎస్. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు చుట్టూ ప్రహరీ.. స్థానికుల హర్షం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్-2 పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా పార్కు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమవడంతో స్పందించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఎన్నికలకు ముందు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు పూర్తి చేయించారు.

రాజకీయాల్లో భీష్ముడు కొణిజేటి రోశయ్య

మాజీ మంత్రి టీజీ వెంకటేష్

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో భీష్ముడు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ కొనియాడారు. ఆదివారం ముషీరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్‌లో వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. రోశయ్య ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం మంత్రి పదవిలో కొనసాగి ఆర్థిక, రాజకీయ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని అన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సెంట్రల్ కమిటీ చైర్మన్, వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా మాట్లాడుతూ.. ఆర్యసమాజ శ్రేయస్సుకు రోశయ్య ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ నాయకులు మహేష్, చంద్రశేఖర్, నారాయణ, మధు, కృష్ణమూర్తి, రమేష్, ప్రభాకర్, ముత్యాల సత్తయ్య, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గంజి రాజమౌళి గుప్తా

బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, భరత్‌కుమార్ తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేవలం రూ.8 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, ఇవి ఏమాత్రం సరిపోవని, రూ. 20 వేల కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ సంయుక్తాధ్వర్యంలో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల ఊసేలేదని, రూ. 5,300కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. 13 బీసీ కులాల ఫెడరేషన్లకు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 2వేల కోట్లు కేటాయించాలని, పాలకమండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెస్‌చార్జీలను రూ. 5 వేల నుంచి రూ. 20వేలకు పెంచాలన్నారు. పలు బీసీ సంఘాల నేతలు నందగోపాల్, టి.రాజేందర్, జిల్లపల్లి అంజి, మట్ట జయంతిగౌడ్, పృథ్విగౌడ్, దినేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న ఎంఎల్‌పీఐ (రెడ్‌ప్లాగ్) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.జయకుమార్

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల ఐక్యతతో బీజేపీని ఓడింగచలుగుతామని ఎంఎల్‌పీఐ (రెడ్‌ప్లాగ్) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.జయకుమార్ అన్నారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో రెడ్‌ప్లాగ్ 3వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆదివారం జరిగాయి. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద విధానాలను అందరూ వ్యతిరేకించాలని కోరారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాల ఐక్యతతోనే రెడ్‌ప్లాగ్ ఐక్య కార్యాచరణ ఉంటుందన్నారు.

ఏపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రసాద్‌బాబు, రాష్ట్ర నాయకులు లింగంపల్లి సత్యవర్ధన్, బసవలింగప్ప, వేమూరి భాస్కర్, సుధమల భాస్కర్, బుజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌పీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా రాజేష్‌ఖన్నా

ఎంఎల్‌పీఐ (రెడ్‌ప్లాగ్) రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా దొంతి రాజేష్‌ఖన్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని పార్టీ జాతీయ కార్యదర్శి జయకుమార్ ప్రకటించారు. ఆయనతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులుగా సుధమల భాస్కర్, వేమూరి భాస్కర్, మన్నెపు బుజేందర్, బి.ఎన్.చారి, మిట్ట అంజన్న, ఎం.డి.కాశీం, ఆర్.సంతోష్, సుధ, సత్యం, విజయ్, లింగస్వామిసహా 13 మంది ఎన్నికయ్యారు.

25, 26 తేదీల్లో అఖిల భారత విద్యార్థుల సదస్సు

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలలో భవిష్యత్ యువతరం పై మనువాద, బ్రాహ్మణీయ, అశాస్త్రీయ భావాలు రుద్దే కుట్రకు ఆర్‌ఎస్‌ఎస్ పాల్పడుతోందని పలువురు వక్తలు ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత్ బచావో రాష్ట్ర హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీలలో అఖిల భారత విద్యార్థుల సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం జరిగింది. సదస్సు వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. తెలంగాణలోని విద్యార్థి, యువతరంను సదస్సుకు తీసుకురావాలని వారు పిలుపునిచ్చారు. భారత్ బచావో చైర్మన్ మనోరంజన్ మహంతి, హరగోపాల్, జస్టిస్ కోల్సే పాటిల్, ప్రొఫెసర్లు మధు ప్రసాద్, అనిత రాంపాల్, పద్మజ షా, లక్ష్మీనారాయణ, నిరంజన్ ఆరాధ్య, నేషనల్ కమిటీ ఇన్‌చార్జి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ముషీరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలోని సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. సాయిబాబా దేవాలయ కమిటీ చైర్మన్ పీవీ రామారావు, సభ్యులు మదన్‌మోహన్, నాగలక్ష్మి, లత, శంకర్‌గౌడ్, కోటేశ్వర్‌రావు ఎ.శంకర్, బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



పల్లకి సేవలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, న్యాయవాది నరసింహారావు తదితరులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల కులదైవం మార్కండేయ స్వామి జయంతి బాగ్‌అంబర్‌పేట పోచమ్మబస్తీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ ఎన్.వెంకటరమణ, ప్రముఖ న్యాయవాది నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కండేయ పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

గోల్నాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర నాయకుడు ఎం. మహేందర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మకుంట భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు పట్టణ ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అడ్డా మీద కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారని, మహిళలకు కనీసం మూత్రశాలలు కూడా లేవన్నారు. సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, అడ్డా నాయకులు తిరుపతయ్య, ధర్మ, వెంకన్న, సూరి, శ్రీను, అంజయ్య, వీరమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని బహూకరిస్తున్న అతిథులు

హరీష్‌కు జంధ్యాల పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్య దర్శకుడు, రచయిత జంధ్యాల పురస్కారాన్ని సినీనటుడు హరీష్‌కు బహూకరించారు. కళానిలయం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ అధికార భాషా సంఘం చైర్మన్ పి. విజయబాబు పాల్గొన్నారు. జంధ్యాల రచయితగా, దర్శకుడిగా ఖ్యాతి పొందారని కొనియాడారు. గాయని పారిజాతకు ఘంటసాల ఇంటర్నేషనల్ అవార్డు బహూకరించారు. వంశీ రామరాజు, సుంకర సత్యనారాయణ, స్వప్న శ్రీనివాస్, వైఎస్ఆర్ మూర్తి, నిర్వాహకులు సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోగల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నివేదన, నీరాజనం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

వివేకానంద ఆశయ సాధనకోసం పాటుపడాలి

కనులపండువగా రామకృష్ణ మఠం స్వర్ణోత్సవాలు



హోమంలో స్వామీజీలు

కవాడిగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం నేటి యువత పాటుపడాలని, అప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. యువత సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ ముందుకెళ్లాలని సూచించారు. రామకృష్ణ మఠం స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, సహాయ ప్రధాన కార్యదర్శి తత్వవిదానంద స్వామి, పుణే రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీకాంతనంద, రాజమండ్రి అధ్యక్షుడు స్వామి పరిజ్ఞానానంద స్వామి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద బోధనలను అనుసరించాలని సూచించారు. స్వర్ణోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం నిర్వహించారు. భువనేశ్వర్ రామకృష్ణ మఠం తొలి అధ్యక్షులు బ్రహ్మానంద స్వామి జయంతి సందర్భంగా ఆయన జీవితంపై సందేశాలు, ప్రసంగాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్రిజ్‌లో షార్ట్‌సర్క్యూట్

ఇంట్లో చెలరేగిన మంటలు

● పేలిన గ్యాస్ సిలిండర్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్‌లో మంటలు చెలరేగాయి. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సయ్యద్ షాహిద్‌కు చెందిన ఇంట్లో మొదటి అంతస్తులో కోటగిరి విజయలక్ష్మి నివసిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఫ్రిజ్ నుంచి పొగలు రావడం ఆమె గమనించింది. వెంటనే కిందకు వచ్చిన అక్కడ ఉన్న వారికి విషయం చెప్పింది. క్షణాల్లో మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే ఫ్రిజ్‌లోని గ్యాస్ సిలిండర్‌తోపాటు వంట గ్యాస్ సిలిండర్ పేలిపోయాయి. రామోజీ ఫిల్మ్‌సిటీలోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇంట్లో భద్రపరిచిన రూ. 12 వేలు, దుస్తులు, సామగ్రి కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు.

రూ. 5 వేల ఆర్థిక సాయం

విజయలక్ష్మికి ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం కింద తహసీల్దార్ రూ. 5 వేలు మంజూరు చేశారు. నగదును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకా మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేష్ బాధితురాలికి అందజేశారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. బాలాపూర్ సాదత్‌నగర్‌కు చెందిన సద్దాంషేక్ బక్షూ(32) భవన నిర్మాణ మేస్త్రీ. అలీనగర్‌లోని ఓ భవనం రెండో అంతస్తులో ఆదివారం అల్యూమినియం రాడ్‌తో ఫ్లోరింగ్ పనిచేస్తున్నారు. ప్రమాదవశాత్తు రాడ్డు విద్యుత్ తీగలకు తగిలింది. కరెంట్ షాక్ కొట్టడంతో అతడు పక్కనే ఉన్న మెట్లపై పడ్డాడు. వెంటనే ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య హీనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తమ్మల నాగేశ్వరరావు అన్నారు. చేనేత కార్మికులను ఆదుకుంటామన్నారు. ఆదివారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంతం పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కమర్తపు మురళి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను చేనేత కార్మికులకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం పద్మశాలీలందరిని కలుపుకుని ముందుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రక్తదానం.. ప్రాణాలు నిలబెట్టే మహత్కార్యం

నల్లకుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ బ్రాహ్మణ స్ట్రీట్‌లో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణాలు నిలబెట్టే మహత్కార్యం అని అన్నారు. రక్తదాతలకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యపార్కులో ఉచిత వైద్య శిబిరం

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లి వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పైగా వాకర్స్‌కు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ ప్రత్యూష, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్. వివేక్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు



కార్టూన్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి తదితరులు

కార్టూన్ కళను నేటి తరానికి అందించాలి

● ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కార్టూన్ కళను నేటి తరానికి అందించాలని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి పిలుపునిచ్చారు. ఎంత పెద్ద విషయాన్ని అయినా పూర్తి వివరాలతో స్పష్టంగా చిన్నగా చూపించేదే కార్టూన్ అని, ఈ కళకు ఉన్న ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ప్రతి కార్టూనిస్టు, రచయితలపై ఉందన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బాచి, వాగ్దేవ, పద్మాదాస్ కార్టూన్ పుస్తకాల లేపాక్షి ఫాంట్ ఆవిష్కరణ సభ జరిగింది. పుస్తకాలను ఆవిష్కరించిన అనంతరం తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. కార్టూన్లకు ఉన్న విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. కార్టూన్‌కు ఉన్న విలువను నేటి తరానికి తెలియజేయడానికి మా ఇంట్లోనే కార్టూన్ పోటీలు నిర్వహించేవారమని, బాపు కార్టూన్స్ అంటే తనకు ఇష్టమని ఆయన పేర్కొన్నారు. హాస్యనటుడు డాక్టర్ గుండూ సుదర్శన్, రమణ, కార్టూనిస్టు కూచి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కన్నె ఉమాదేవి కార్పొరేటర్‌గా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం కాచిగూడ అభివృద్ధి కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులను సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో డివిజన్ అభివృద్ధి సాధ్యమైందన్నారు. కార్పొరేటర్ ఉమాదేవి మాట్లాడుతూ.. కాచిగూడ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు కృష్ణకుమార్, నాగభూషణంచారి, సుభాష్‌పటేల్, క్షీరసాగర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయ కళలో

కూచిపూడి నృత్యానికి ప్రత్యేక స్థానం



కళాకారులను సత్కరించిన అతిథులు

రాంనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయ కళలో కూచిపూడి నృత్యానికి ప్రత్యేక స్థానం ఉందని యక్షగాన నృత్య గురువు డాక్టర్ యేలేశ్వరపు చలపతిశాస్త్రి అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో శివశక్తి ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకుడు జి.ఎస్.వాసు ఆధ్వర్యంలో అంతారామమయం - 2024 సంగీత నృత్యోత్సవం జరిగింది. ఉత్సవాలను ప్రారంభించిన చలపతిశాస్త్రి మాట్లాడుతూ.. తెలుగువారి మణిమయ కిరీటం కూచిపూడి అని అన్నారు. సంగీత, నృత్యగురువు విక్కిరాల జ్యోత్స్న (కూచిపూడి), పి.శ్రీనివాస ప్రత్యూష (సంగీతం), సంస్థ వ్యవస్థాపకుడు, జి.ఎస్.వాసు శిష్య బృందం నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంగీత, నృత్య కళాకారులను అతిథులు సత్కరించి అభినందించారు.